## క్లుప్తంగా

### నేడు అడదాకులపల్లిలో 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ'

పెనుకొండ రూరల్: అడదాకులపల్లి సోమవారం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అనుబంధ విభాగాల నేతలు, ప్రజా ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకావాలని. పట్టణ, మండల కన్వీనర్లు నరసింహ, సుధాకర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

### రేపు వైఎస్సార్ వర్ధంతి

మడకశిర: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆదివారం తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు.

రొళ్ల: మండల కేంద్రంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్ 16వ వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ సభ్యుడు బి.అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

అమరాపురం: మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

గుడిబండ: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని కోరారు.

### ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన


నృత్యం చేస్తున్న విద్యార్థులు

రొద్దం: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపయ్య వద్ద రొద్దం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు తమ నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఏకధాటిగా 20 పాటలకు నృత్యాలు చేయడంతో నిర్వాహకులు వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగలక్ష్మి, ఉపాధ్యాయులు రామాంజినేయులు, గోకుల్, కమిటీ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న యువకులు

అమరాపురం: మండల కేంద్రంలోని ఈశ్వరీయ విశ్వవిద్యాలయ కేంద్రం నిర్వహకురాలు పుష్పక్క ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. అనంతపురం నుంచి వచ్చిన రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో రక్తాన్ని సేకరించారు. మొత్తం 100 మంది యువకులు రక్తాన్ని దానం చేశారు. ఈసందర్భంగా పుష్పక్క రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు

రొళ్ల: రొళ్లకొండ గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రొళ్లకు చెందిన రంగనాథప్ప మడకశిరలో పని ముగించుకుని బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. టోల్‌ప్లాజా బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని హైవే అంబులెన్స్‌లో రొళ్ల పీహెచ్‌సీకి తరలించారు.


హిందూపురం: లేపాక్షి రోడ్డులో సాగుతున్న గణేశ్ నిమజ్జనోత్సవంలో సాయి భక్తమండలి సభ్యులు


మడకశిరలో వినాయక నిమజ్జనంలో భక్తుల సందడి


లేపాక్షిలో వర్షంలో సాగుతున్న వినాయక విగ్రహాల ఊరేగింపు

## గంగ ఒడికి గణపయ్య

సాక్షి బృందం: హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల్లో ఆదివారం వినాయక నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా మండపాల వద్ద ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం వినాయక ప్రతిమలను ట్రాక్టర్లపై ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.ఈ సందర్భంగా డప్పు వాయిద్యాలు, డీజే శబ్దాలకు అనుగుణంగా యువకులు, మహిళలు, చిన్నారులు చిందులు వేశారు. అనంతరం సమీపంలోని చెరువులు, వంకలు, వాగుల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


అమరాపురంలో నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న వైసీ. గోవర్ధన్‌రెడ్డి, నాయకులు


రొళ్ల మండలం కొత్తపాళ్యంలో జెడ్పీటీసీ అనంతరాజును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు


మడకశిరలో గణేశుడి విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం


రొళ్ల మండలం టీడీ పల్లిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు


అగళి మండలం ఆలుడిలో వినాయక వద్ద నృత్యం చేస్తున్న మహిళలు, యువకులు


లేపాక్షిలో వినాయక నిమజ్జనంలో పాల్గొన్న భక్తులు


గోరంట్లలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం


హిందూపురం: శ్రీకంఠపురంలో సాగుతున్న నిమజ్జనోత్సవం


హిందూపురం: లక్ష్మీపురం కాలనీ వాసుల నిమజ్జనోత్సవం


వెంకటమ్మనహళ్లిలో వినాయకుడికి పూజలు చేస్తున్న దృశ్యం


అమరాపురంలో నిమజ్జనానికి తరలివెళుతున్న గరుడ గణపతి


మడకశిర చెరువులో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం


హిందూపురం మండలం రామచంద్రాపురంలో నిమజ్జనంలో పాల్గొన్న చౌళూరు మధుమతిరెడ్డి


అమరాపురంలో నిమజ్జనానికి వెళుతున్న వినాయకుడు

## నలుగురిపై కేసు నమోదు

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లికి చెందిన నలుగురిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాలు.. శనివారం రాత్రి బిసమానేపల్లిలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా జాతీయ రహదారి పక్కన వున్న మల్లేశ్వరి దేవాలయం సమీపంలో విగ్రహాలను ఊరేగింపు చేపట్టారు. అయితే వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించి పబ్లిక్‌కు ఇబ్బంది కలిగించారు. అంతేకాకుండా నడిరోడ్డుపై వాహనాలు, ప్రజలు వెళుతున్నప్పటికి టాపాసులను పేల్చి ఇబ్బంది పెట్టారు. ఈ విషయంపై పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నివారిస్తుండగా ఆ గ్రామానికి చెందిన జే.విశ్వనాథ్, బాలక్రిష్ణ, శేఖర్, జే.సంజీవప్ప పోలీసులపై తిరగబడి దాడి చేశారు. పోలీసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని ఎస్ఐ తెలిపారు.

## సీఈఈలో మెరిసిన విద్యార్థిని


ఎంజీ హాసిని

రొళ్ల: మల్లినమడుగు గ్రామానికి చెందిన గమాటి గారి అమ్మాజక్క, ఎంజీ రంగనాథ్ కుమార్తె ఎంజీ హాసిని శనివారం సాయంత్రం వెలువడిన రాష్ట్ర, జాతీయ స్థాయి ఎన్‌సీఆర్టీ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్(సీఈఈ)లో కర్ణాటక స్టేట్ ఫస్ట్ ర్యాంక్, జాతీయ స్థాయిలో 21వ ర్యాంక్ సాధించింది. దీంతో ఆమకు మైసూర్‌లో రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సంస్థలో సీటు లభించింది. ఈసందర్భంగా విద్యార్థినిని తల్లి దండ్రులతోపాటు గ్రామస్తులు అభినందించారు.

## జేడీఎస్ ధర్మస్థల సత్య యాత్ర


సత్య యాత్రలో తిమ్మరాయప్ప

పావగడ: జేడీఎస్ యువ విభాగం రాష్ట్రఅధ్యక్షుడు నిఖిల్ కుమారస్వామి నేతృత్వంలో వందలాది మంది నేతలు, యువ విభాగం నాయకులు ధర్మ స్థలం దేవాలయానికి మద్దతుగా ధర్మ స్థలం ఆలయానికి ఆదివారం సత్య యాత్ర సాగించారు. ఇటీవల ధర్మ స్థలం వద్ద చోటు చేసుకున్న మహిళల హత్యా కాండ దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి విదితమే. చివరకు సిట్ రిపోర్ట్ లో ఎలాంటి అఘాయిత్యాలు జరగలేదని పేర్కొనడం తో మంజునాథ స్వామి భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జేడీఎస్ నాయకులు హాసన్ నుంచి సత్య యాత్రగా ధర్మ స్థలం ఆలయం వద్దకు చేరుకుని తమ మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, ఆర్సీ అంజినప్ప, సొగడు వెంకటేశ్ తదితర నాయకులు సత్య యాత్రలో పాల్గొన్నారు.

## కరాటే పోటీల్లో చిన్నారుల ప్రతిభ


చిన్నారులను అభినందిస్తున్న మాస్టర్లు

హిందూపురం: బెంగళూరులో కోరమంగళ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన 4వ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్ షిప్‌లో హిందూపురం కరాటే శిక్షకులు సెన్సేయి ఫైరోజ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు ప్రతిభను చాటుకున్నారు. పోటీలలో కటస్, ఫైట్ కేటగిరీలలో రాచపల్లి జెడ్పిస్కూల్ విద్యార్థి సి. కిశోర్ కుమార్ బంగారు, సిల్వర్ మెడల్స్, 6వ తరగతి విద్యార్థి శ్రీరాం సిల్వర్, బంగారు మెడల్స్ సాధించారు. కాగా చిన్న గుడ్డంపల్లి ఎంపీపీ స్కూల్ విద్యార్థి సి.ధనుష్ కుమార్ బ్రాంజ్ మెడల్, 6వ తరగతి విద్యార్థి జాన్‌విక్టర్ బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను మాస్టర్ ఫైరోజ్, ఉసామఖాన్ అభినందించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయులకు కూటమి మోసం


ఐక్యతను చాటుతున్న యూటీఎఫ్ నాయకులు

పరిగి: ఉద్యోగ, ఉపాధ్యాయులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని యూటీఎఫ్ నాయకులు విమర్శించారు. మండలంలోని సేవామందిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఆడిటోరియంలో ఆదివారం యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ అధికారంలోని వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని నమ్మబలికించి కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిస్తున్నా నేటికీ ఉపాధ్యాయుల సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే 12 పీఆర్సీని ప్రకటించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధన విషయంలో ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. బోధనేతర పనుల విషయంలో అన్యాయానికి ఒడిగడుతోందన్నారు. డీఎస్సీ-2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు బూతన్న, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ మహంతేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

మడకశిర: ఆర్టీసీ ఉద్యోగులు అంకితభావంతో పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప సూచించారు. మడకశిర ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న మెళవాయి గ్రామానికి చెందిన చిన్నప్ప ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు.ఈసందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపోలో ఎస్ఎంయూ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈరలక్కప్ప, రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి,వైఎన్ రవిశేఖర్‌రెడ్డి మట్లాడుతూ చిన్నప్ప సేవలను కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని గుర్తు చేశారు. అనంతరం డ్రైవర్ చిన్నప్పను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, నాయకులు నరసింహ, ధను, గోపి,రంగనాథ్, హరి, రఘు, నరసింహులు, రవి, మున్సిపల్ చైర్మన్ మాజీ ప్రకాశ్, ఎస్ఎంయూఏ నాయకులు సుబ్బరాయుడు, జయసింహ, ముద్దప్ప,పురుషోత్తం, డిపో అధ్యక్ష, కార్యదర్శులు, డీఎం రంగ భాష్యం, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.


డ్రైవర్ చిన్నప్పను సన్మానిస్తున్న ఈరలక్కప్ప, నాయకులు

## టెక్నికల్ అసిస్టెంట్ తిప్పేస్వామికి సన్మానం

మడకశిర: స్థానిక పట్టు పరిశ్రమశాఖ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న తిప్పేస్వామి ఆదివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా పట్టు పరిశ్రమశాఖ కార్యాలయంలో తోటి సిబ్బంది ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు.

## మాంగల్య సరం చోరీ

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుండార్లహళ్లిలో నిద్రిస్తున్న ఓ మహిళ మెడ లోని మాంగల్య సరం, రెండు మొబైల్ ఫోన్ల చోరీ అయిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన చందన గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహ పూజలకు సాయంత్రం వెళ్లి రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో ఇంటికి తిరిగి వచ్చి వాకిలికి గడియ పెట్టి ఇంట్లో నిద్రించింది. ఆ సమయంలో ఓ ముగ్గురు ముసుగు దొంగలు వాకిలి పగులగొట్టి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని 5 తులాల బంగారు మాంగల్య సరం లాక్కొని అక్కడే ఉన్న రెండు మొబైళ్లను ఎత్తుకెళ్లారు. అనంతరం ఆమె భయభ్రాంతులకు గురై గట్టిగా కేకలు వేయగా చుట్టు పక్కల వాళ్ళు దొంగలను వెంటాడినా ప్రయోజనం లేక పోయింది. రెండు నెలల క్రితం ఆమె తల్లి మాంగల్య సరం కూడా ఇదే తరహాలోనే చోరికి గురైంది. జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, స్థానిక సీఐ సురేశ్, ఎస్ఐ విజయకుమార్ ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితురాలు చందన ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు దాఖలు చేసుకుని దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు.

## కాడెద్దులు మాయం.. సైకిల్ గుంటకతో వ్యవసాయం


సైకిల్ చక్రంతో గుంటక పాస్తున్న రైతు ఫకారం మరిసిద్దయ్య

గుడిబండ: వ్యవసాయం తీరు మారుతోంది. ఒకప్పుడు పశువులతో సేద్యం చేసిన రైతన్నలు వాటిని పోషించలేక అమ్ముకుంటున్నారు. ఈక్రమంలో వ్యవసాయ పనులు యంత్రాలతో చేయాల్సి వస్తోంది. వేల బాడుగలను చెల్లించే స్తోమత లేని సన్నకారు రైతులు వినూత్న ఆలోచనతో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో కాడెద్దులు లేని రైతులు సైకిల్ చక్రాన్నే గుంటకగా వాడుకుంటున్నారు. దీని తయారీకి కేవలం రూ. వెయ్యి ఖర్చవుతుంది. దీంతో రోజుకు ఎకరాలో కలుపు తీసుకోవచ్చు. కాడెద్దుల్లో గుంటక వేయాలంటే రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకూ చెల్లించాల్సి వస్తోంది. సైకిల్ గుంటకతో అయితే డబ్బు ఆదా అవుతోందని రైతులు పేర్కొంటున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 8వేల ఎకరాల్లో ఏటా ఖరీఫ్ పంటలు సాగవుతాయి.

## ముళ్లపొదలు.. రాకపోకలకు గుబులు


రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లు

మడకశిరరూరల్: మండలంలోని ఉప్పిడిపల్లి గ్రామం నుంచి ఎం రంగాపురం వరకూ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పెద్ద వాహనాలు ఎదురుగా వస్తే ద్విచక్రవాహనదారులు కూడా ఎదురుగా వెళ్లలేని దుస్థితి నెలకొందని చెబుతున్నారు. రాత్రి సమయంలో రాకపోకలకు మరింతగా ఇబ్బందిగా ఉంటుందన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంపచెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.